# నట్టింటి దీపం

(గత సంచిక తరువాయి)

ఆ రాత్రి సుమిత్రకి కందిపచ్చడిలో కారం ఎక్కువయింది; బీరకాయ కూర చప్పిడికూర కనక తనకి హితవైన వస్తువుకాదు, యింగువ లేకపోతే చారుకి రుచేమిటి? పక్కని కూచున్న రాజు తనను బతిమాలి తినమని అడగడు. నిర్లక్ష్యమేనేమో అనుకుంది సుమిత్ర.

పక్క మీద పడుకున్నదేగాని సుమిత్రకి నిద్రపట్టడంలేదు. పదకొండు, పన్నెండు, ఒంటిగంట, రెండుగంటలు లెక్కబెడుతోంది. మండువాలోనుంచి వెన్నెల బావ మంచంమీద పడుతోంది. అతని మనసులో మర్మం తనకి తెలీడం లేదు తనని పెళ్ళాడాలని అతని కెందుకుండకూడదూ! సీతయ్య బాబుతో మామయ్య వెనకే చెప్పాడు. నక్షత్రం తిరక్కుండా ఆ ప్రసక్తి తీసుకురాకూడదని ఆయన ఊరుకున్నాడు. ఎందుకింత తొందర బావకి?

బావకి తనమీద యిష్టం లేదేమో ననిపించింది. ఉత్తరక్షణంలో నెల్లాళ్ళలోపలే రావాలీ ఈ సమస్యలన్నీ? ఏం ముంచుకుపోయిందని ప్రయాణం కడుతున్నాడు బావ?

సుమిత్ర మనసుకి శాంతి ఎక్కడ? తీరాన్ని తాకే సముద్ర కెరటాల్లా ఉద్ధృతాన్ని ప్రకటిస్తున్నాయి ఆమె భావోద్వేగ వీచికలు. మనసు ఆ లోతుల్లో మునకలు వేసి వేసి అలసి నిదిరించింది. మూడు కొట్టడంకూడా ఆమెకి తెలుసు.

ఆమె నిద్రనుంచి లేచేవేళకి రాజు దంతధావనం ముగించి, కాఫీ సేవించి, గెడ్డానికి సబ్బు పులుముకుంటున్నాడు. రెండు చేతులూ గుమ్మానికి బారలుగా అడ్డంచాచి, "నిన్ను వెళ్ళనివ్వను" అంది ఆవులిస్తూ అల్లరితనంతో సుమిత్ర. రాజు నిర్ఘాంతపోయాడు సుమిత్రమనసు చిక్కబట్టుకుని, "ఏం అలా చూస్తావ్— పారిపోలేవు తల్చుకుంటే వలేసి పట్టుకురాగలను," అంది స్త్రీ సహజమైన దర్పంతో. ఈ సుమిత్ర సరికొత్తది. రాజుకి యిలాటి సుమిత్ర తెలీదు అతని కాళ్ళు వణికాయి. ఈ పల్లెటూరినించి తనకింక స్వేచ్ఛ లభించదు కాబోలు. వంగతోటా, చిక్కుడుపాదూ, పాటిమన్నూ, తామర చెరువూ, మురికినీళ్ళూ, గ్రామతగాయిదాలూ—యింతేనా తన బతుకు?

యన్. ఆర్. చందూర్

హిమవన్నగ శిఖరాన్ని తాక యత్నించే అతని ఆదర్శాలు గూఢచారుల వేషం వేసుకొచ్చి, "తస్మాత్ జాగ్రత-జాగ్రత" అంటూ చెవిలో ఊదాయి ఒక్కసారి వళ్ళు దులుపుకు పీపుతడుము కున్నాడు.

సుమిత్ర పాలకుండ దాలిమీద పెట్టి, చాకలిది తీసుకొచ్చిన చలవబట్టలు జాబితా వొప్పగించుకొని, పెత్తల్లికి కూర తరిగిచ్చి, పనిమనిషిచేత మందువాసావిడి ఊడిపించి, తను స్నానంచేసి చీరె మార్చుకుని రాజుదగ్గిరికి వచ్చేటప్పటికి పదయింది.

"ఏమిటంటావు, బావా ?" అంది హుషారుగా.

"నేనేమీ అనలేదే ! సుమిత్రా, నువ్వు పొరబడుతున్నావ్, నాకు పెళ్ళి చేసుకునేపాటితీరికలేదు.యిట్లాసంసారం, పెళ్ళాంపిల్లలూ—యిలాటివి నా తత్వానికి సరిపడవు. అదీకాక, ప్రపంచం ఎలా ఉందో చూడు" అన్నాడు రాజు.

"ప్రపంచానికేం—భేషుగ్గా ఉంది నువ్వు ఈ సాయింత్రం బండికి వెత్తే రామయ్య కౌలు ఎవరు రాయిస్తారూ, ముసలయ్య యివ్వవల్సిన బీడుశిస్తు ఎలా వస్తుందీ, గాదెలో ఉన్న ధాన్యం, ఏం చెయ్యాలీ, దాళవాపంట మాటేమిటీ— నీకు తూర్పూ పడమరా తెలిసినట్టులేదే! ఇవన్నీ యిలావుండగా ఆ ముసిలావిడ సంగతి?" అంటూ దాడిచేసింది సుమిత్ర.

"అన్నీ నువ్వే చూచుకుంటావుగా!" అన్నాడు రాజు చలనంలేకుండా. సుమిత్ర ఆ సముదాయింపుకి మురిసిపోయింది. కాని ఉండబట్టలేక అంది — "మొగాడివి నీకు లేని బాధ్యత నాకా ?"

కంఠస్థాయి మార్చి ప్రాధేయ పూర్వకంగా అడిగింది సుమిత్ర- "నీ మనసులో మాట నాకు చెప్పకూడదూ?"

"చెబుతాను విను" అంటూ ఉపన్యాసం మొదలెట్టాడు రాజు. ప్రపంచమంతనీ నేను ప్రేమిస్తున్నాను. ప్రేమ మినహా మరొకశక్తిని నమ్మను. నేను ప్రేమోపాసకుణ్ణి రెండవ ప్రపంచ యుద్ధం మొన్న మొన్ననే ముగిసింది. మూడో దానికి అప్పుడే ప్రాతిపదికలు పడుతున్నాయి. రెండు యుద్ధాల మధ్య బతుకుతున్న మనకి సుఖపడే హక్కు ఉందా? మూడో ప్రపంచ యుద్ధం ముంచుకొచ్చే లోపున పీడిత మానవలోకానికి నా హృదయాన్ని పంచిపెట్టొద్దూ ?"

ప్రవాహాన్ని అడ్డి, "ఎందుకా పంచిపెట్టడం ? హృదయాన్నే బద్దలు చేసుకుంటేగాని పంచిపెట్టలేవా ? సామరస్యం లేని బతుకులో బీటలు వారిన గుండె లోకానికివ్వగలిగే అమృతధార ఏముంటుంది?" అని అడిగింది సుమిత్ర.

రాజు భవబంధాలు తెంచుకుని సీమకుందేలులా పరిగెత్తుదామనుకుంటున్నాడు. ఉన్నదానిలో తృప్తి పడనీయని పురుషావేదన అతనిది.

